ప్రజాశక్తి
గురువారం 15 ఫిబ్రవరి 2024 5 విజయనగరం

జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా శామ్యూల్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా రుద్రపాటి శామ్యూల్ జాన్ బుధవారం తమ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. పార్వతీపురం - మన్యం, శ్రీకాకుళం జిల్లాలకు కూడా ఆయన మైనారిటీ సంక్షేమ అధికారిగా వ్యవహరిస్తారు. మన్యం జిల్లాలో స్టేట్ ఆడిట్ విభాగంలో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా జీవిత కాలం వరకు పనిచేసిన శామ్యూల్ జాన్ చేసుకున్న అభ్యర్థన మేరకు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా నియమిస్తూ ఆ శాఖ కార్యదర్శి ఎపిఎండి ఇంతియాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. మైనారిటీ సంక్షేమ అధికారిగా బాధ్యతలు చేపట్టిన శామ్యూల్ జాన్‌ను ఆ శాఖ సిబ్బంది, పలువురు మైనారిటీ ప్రముఖులు అభినందించారు

ఇలాంటి ఎమ్మెల్యేను దేశంలోనే చూడలేదు

"పార్వతీపురం ఎమ్మెల్యేకు అవినీతి రావు అని పేరు పెట్టాలేమో!. భూములు కబ్జా చేస్తాడు. చెరువులను పూడ్చి పట్టాలు సృష్టిస్తాడు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు అమ్ముకుంటాడు. ఏకంగా తహశీల్దార్ సంతకాలే ఫోర్జరీ చేస్తాడు. ఇలాంటి ఎమ్మెల్యేను దేశంలో ఎక్కడా చూడలేదు. ఎ1, ఎ2లు జగన్, సాయి రెడ్డి అయితే ఇక్కడ ఎమ్మెల్యే ఎ3 గా అనుకోవచ్చు".

- పార్వతీపురం సభలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావుపై టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ వ్యాఖ్యలు

ఉత్తరాంధ్ర దోపిడీకి ఆ ముగ్గురికి లైసెన్స్

- చిన్నశ్రీను చేతిలో రిమోట్ కంట్రోల్ రాజన్నదొర
- అధికారంలోకి వస్తే జిల్లాలో కేన్సర్ ఆస్పత్రి
- శంఖారావం సభల్లో నారా లోకేష్

కార్యకర్తలతో కరచాలనం చేస్తున్న లోకేష్

సభకు హాజరైన జనం : మాట్లాడుతున్న టిడిపి జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్

ప్రజాశక్తి-సాలూరు, పార్వతీపురం రూరల్, బాడంగి

ఉత్తరాంధ్ర జిల్లాల దోపిడీకి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ముగ్గురు వైసిపి నేతలకు లైసెన్సు ఇచ్చారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. వారు ఈ ప్రాంతంలో భూ కబ్జాలు, దందాలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారంలోకి వస్తే సమస్యలను పరిష్కరించడంతో పాటు జిల్లాకో కేన్సర్ ఆస్పత్రి ఏర్పాటు చేస్తామని తెలిపారు. టిడిపి చేపట్టిన శంఖారావంలో భాగంగా బుధవారం పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి నియోజకవర్గం బాడంగిలో జరిగిన సభల్లో నారా లోకేష్ మాట్లాడారు. ఉత్తరాంధ్ర జిల్లాలను దోచుకోవడానికి మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ విజయసాయిరెడ్డి, మరో ఎంపి వైవి సుబ్బారెడ్డిలకు జగన్ లైసెన్స్ ఇచ్చారని ఆరోపించారు. ఈ ప్రాంతంలో భూముల కబ్జా, దందాలు ఆ ముగ్గురి కనుసన్నల్లో జరుగుతాయని విమర్శించారు. నియోజకవర్గానికి చెందిన డిప్యూటీ సీఎం రాజన్నదొర రిమోట్ కంట్రోల్ జరిగాయని అన్నారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతిలో రిమోట్ వుంటుందని చెప్పారు. ఉపముఖ్యమంత్రి అయినా గిరిజనుల జీవితాల్లో మార్పు రాలేదన్నారు. పెద్ద ఎత్తున భూకబ్జాలు చేసి బినామీ పేర్లపై పెట్టారని విమర్శించారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలోనూ రాజకీయాలు జొప్పించారని, మన్యం జిల్లా లో గెలిచిన పాచిపెంట జట్టును ఫైనల్స్‌కు పంపకుండా రాజకీయం చేశారని ఆరోపించారు.

పార్వతీపురం నియోజకవర్గానికి హామీలు

తాము అధికారంలోకి వస్తే పార్వతీపురం పట్టణానికి బైపాస్ రోడ్డు, ప్రతి ఇంటికి కుళాయి ద్వారా సురక్షితనీరు, డంపింగ్ యార్డును తరలించి మోడ్రన్ పట్టణంగా తీర్చిదిద్దుతామన్నారు. జంఝావతి, అడారు మినీ రిజర్వాయర్ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సీతానగరం, బలిజిపేట మండలాలకు తోటపల్లి సాగునీరు అందిస్తామన్నారు. నియోజకవర్గంలో స్పోర్ట్స్ స్టేడియం కట్టిస్తామన్నారు. మున్సిపల్ కౌన్సిలర్ కోలాడ నారాయణరావుపై జరిగిన దాడిని పార్టీ తీవ్రంగా ఖండించిందని తెలిపారు.

క్రిస్టియన్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తాం

బాడంగిలో సభకు ముందు నారా లోకేష్‌ను అరకు పార్లమెంట్ పరిధిలోని 32 మండలాల పరిధిలోని పాస్టర్ హెడ్‌లు కలిసి సమస్యలను విన్నవించారు. తమకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, అసెంబ్లీలో తమ వాణి వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. క్రిస్టియన్ మైనార్టీలకు ప్రత్యేక కార్పొరేషన్, బైబిల్ కాలేజ్ ఏర్పాటు చేయాలన్నారు. లోకేష్ మాట్లాడుతూ... యువగళం పాదయాత్రలో క్రిస్టియన్ మైనార్టీల సమస్యలను స్వయంగా చూశానని అన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత క్రిస్టియన్ కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. చర్చి నిర్మాణాలకు సహకారం అందిస్తామన్నారు. బరియల్ గ్రౌండ్స్ ఏర్పాటుతో పాటు ప్రహరీలు నిర్మిస్తామన్నారు.

అనంతరం జరిగిన సభలో లోకేష్ మాట్లాడుతూ ఇక్కడి ఎమ్మెల్యే శంబంగి ఇంకులేని పెన్నులాంటి వారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడును పదవుల్లో న్యాయం చేయలేకపోయామని, తన తప్పిదం వల్లే జరిగిందని, మరోసారి అలా జరగకుండా అధికారంలోకి వచ్చిన వెంటనే లక్ష్మునాయుడును చట్ట సభలకు పంపిస్తామని ప్రకటించారు. బాడంగి మండలంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని తెలిపారు. కొండదేవరపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభిస్తామని, బాడంగి, రామభద్రపురం మండలాలకు పెద్దగెడ్డ నీరందిస్తామని తెలిపారు. ఇక్కడ ఎరుకుల పాకలో సర్పంచ్, ఎంపిటిసిలు పాలవలస గౌరును అభివృద్ధి పనులు చేయకుండా వృత్తులకు అడ్డుపడుతూ కేసులు పెడుతూ అధికారులు భయపెడుతున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఇబ్బంది పెట్టిన వారిని వదిలి పెట్టేది లేదని అన్నారు.

పార్వతీపురంలో సభాధ్యక్షులు టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయచంద్ర మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే మన ఇళ్లపైకి గూండాలను, పోలీసులను పంపి వేధిస్తున్నారు, మీకు వడ్డీతో సహా తిరిగి చెల్లించేరోజు దగ్గర్లోనే ఉందని హెచ్చరించరు. సాలూరులో సభకు అధ్యక్షత వహించిన నియోజకవర్గ ఇంఛార్జి సంధ్యారాణి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, మంజూరైన జైకా నిధులను కూడా ఖర్చు చేయలేదని చెప్పారు. బాడంగిలో బొబ్బిలి నియోజక వర్గ ఇన్‌ఛార్జి బేబినాయన మాట్లాడుతూ నియోజకవర్గడంలో నెలకొన్న సమస్యలను వివరించారు. సభల్లో అరకు పార్లమెంటు పార్టీ అధ్యక్షులు కిడారి శ్రావణ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యేలు బొబ్బిలి చిరంజీవులు, ఆర్‌పి భంజ్‌దేవ్, తెంటు లక్ష్మునాయుడు, జనసేన నాయకులు లోకం మాధవి, బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, పార్వతీపురం ఇన్‌ఛార్జి ఆదాడ మోహనరావు తదితరులు మాట్లాడారు.

జిల్లాకు జగన్ నెరవేర్చని 50 హామీలు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో పర్యటన సందర్భంగా జగన్ 50 హామీలు ఇచ్చారని ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని లోకేష్ అన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టును, రామతీర్థ సాగర్, పెద్దగెడ్డ ప్రాజెక్టులను పూర్తి చేయలేదని, గోస్తా-చంపావతి నదుల అనుసంధానం చేయలేదని తెలిపారు. టిడిపి-జనసేన అధికారంలోకి వస్తే హామీలన్నీ నెరవేరుస్తామని తెలిపారు. కియా మాదిరిగా ఉత్తరాంధ్రకు పెద్దఎత్తున పరిశ్రమలు తీసుకువస్తామన్నారు.

లోకేష్‌కు వినతులు

పార్వతీపురంలో వివిధ వర్గాల ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై యువనేతకు పెద్దఎత్తున వినతిపత్రాలు అందజేశారు. సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. టిడిపి మేనిఫెస్టోలో సిపిఎస్, జిపిఎస్ రద్దు, ఒపిఎస్ అమలు అంశాలను చేర్చాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు.. లోకేష్‌కు వినతి అందించారు.

లోకేష్‌కు వినతి అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

భోగాపురంలో నిరసన తెలిపి తహశీల్దార్‌కు వినతినిస్తున్న ఉద్యోగులు

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి- బొబ్బిలి, భోగాపురం, డెంకాడ

ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర జెఎసి ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం మధ్యాహ్న భోజన సమయంలో తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్‌లు, జిపిఎఫ్‌ఎ, పిజిఎల్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఐఆర్ వెంటనే ప్రకటించాలని కోరారు. కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, పెండింగ్ డిఎలు, ఏరియర్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

భోగాపురం తాహశీల్దార్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు.ఎపియున్ జి.ఒ. అధ్యక్షులు కొమ్మూరు దుర్గారావు, జాయింట్ కార్యదర్శి ప్రశాంత్, ప్రెసిడెంట్ జగదీస్, వైస్ ప్రెసిడెంట్ శేఖర్, మహిళా కార్యదర్శి పి.కృష్ణ వేణి, రమణ, సత్యనారాయణ, సురేష్, గురుభక్తులు, యాషయ్య, వరలక్ష్మి, అప్పలనాయుడు అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపి తహశీల్దారుకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు 12వ పిఆర్‌సి, ఐఆర్ 30శాతం అమలు చేయాలని జెఎసి నాయకులు ఎపి ఎన్‌జిఒ నెల్లిమర్ల తాలూకా యూనిట్ ప్రధాన కార్యదర్శి వై.రమణ, జాయింట్ సెక్రటరీ పి.సి నవీన్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు రమణ, నవీన్ , పి.శంకర రావు, కె. ధనుంజయ్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : ఉద్యోగుల న్యాయ బద్ధమైన డిమాండ్స్‌ను ప్రభుత్వం పరిష్కరించక పోతే భవిష్యత్ ఆందోళన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని బొబ్బిలి తాలూకా యూనిట్ జెఎసి ప్రధాన కార్యదర్శి బి రామారావు హెచ్చరించారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా బుధవారం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆర్‌డిఒ సాయిశ్రీకి అందించారు. కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు, ఫెడరేషన్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జెసి రాజు, ఎన్‌జిఒ నాయకులు జి రామారావు, కె కర్ణ, బలరాం, బంకురు ప్రసాద్, రామ సత్యం, యుగంధర్, రామలప్పుడు, చుక్క శ్రీను తదితరులు పాల్గొన్నారు.

20న గాంధీ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 20న ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ ఎదురుగా మహాత్మా గాంధీ విగ్రహాన్ని ప్రారంభించనున్నట్లు మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి వెల్లడించారు. బుధవారం గాంధీ విగ్రహం ప్రాంతంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశానికి స్వాతంత్రాన్ని సమపార్జించిన మహాత్మా గాంధీని మననం చేసుకుంటూ నగరంలోని ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ ఎదురుగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారవు. విగ్రహాన్ని నెలకొల్పడమే కాకుండా చుట్టూ ఆహ్లాదకర వాతావరణం కలిగించేలా ఏర్పాట్లు చేసామన్నారు. సమావేశంలో వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, సీనియర్ కార్పొరేటర్లు కేదారిశెట్టి సీతారామమూర్తి, కంటుభుక్త తవిటిరాజు, వైసిపి నాయకులు, పిల్లా క్రాంతికుమార్, యడ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మినిస్టీరియల్ భవనాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలవాలి

మినిస్టీరియల్ భవనం ప్రారంభోత్సవంలో జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జెడ్‌పి నిధులు సుమారు రూ.9లక్షలతో ఆధునీకరించిన పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం విజయనగరం శాఖ భవనాన్ని బుధవారం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రభుత్వం ఇన్ని సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయడానికి, ఉద్యోగుల సంపూర్ణ సహకారమే కారణమని అన్నారు. ఉద్యోగుల సహకారం లేనిదే ఏ కార్యక్రమం కూడా ముందుకు వెళ్లదని ఆయన స్పష్టం చేశారు. భవన నిర్వహణలో ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ కె.రాజకుమార్, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు చింతాడ మురళి, కార్యదర్శి వంగపండు రాంబాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ కెబి శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు, జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

మిమ్స్ ఉద్యోగులకు అండగా ఉంటాం

ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల రౌండ్ సమావేశంలో తీర్మానం ● 19న జిల్లా వ్యాప్తంగా రాస్తారోకోలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మిమ్స్ ఉద్యోగుల న్యాయమైన పోరాటం వెనుక తాము ఉన్నామని, న్యాయం జరిగే వరకు పోరాటానికి అండగా ఉంటామని పలువురు ప్రజాసంఘాలు, కార్మిక సంఘాల నాయకులు తెలిపారు. మిమ్స్ ఉద్యోగుల పోరాటానికి మద్దతుగా 19న జిల్లా వ్యాప్తంగా రాస్తారోకోలు చేపట్టాలని నిర్ణయించారు. బుధవారం స్థానిక ఎన్ పి అర్ భవనంలో సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ ప్రజా సంఘాల, కార్మిక సంఘాల నాయకులు పాల్గొని మాట్లాడారు. ముందుగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ యాజమాన్యం ఉద్యోగులకు సంఘం లేకుండా చేసి గత మూడేళ్లగా ఎటువంటి సౌకర్యాలూ కల్పించకుండా నిరంకుశంగా చూసిందన్నారు. ఏడు డిఎలు ఇవ్వకుండా ఉద్యోగులకు అన్యాయం చేసిందన్నారు. అడిగిన ఉద్యోగులను సస్పెండ్ చేయడం, బెదిరించడం వంటి చర్యలకు యాజమాన్యం పాల్పడుతోందన్నారు. గత కొద్ది రోజులుగా మిమ్స్ వద్ద ఉద్యోగులు ఆందోళన చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోకుండా నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. సమస్యలను పరిష్కరించాలని అడుగుదామంటే మిమ్స్ లో వినేనాథుడే కనిపించడం లేదన్నారు. ఒక వేళ ఎవరైనా అడిగితే బెదిరింపులు, కక్ష సాధింపులకు పాలపడుతోందన్నారు. ఒకవేళ ఎవరైనా అడిగితే బెదిరింపులు, కక్ష సాధింపులు చేస్తూ ముందస్తు నోటీసులు లేకుండా నేరుగా సస్పెండ్‌లు లేదా బదిలీలు చేస్తున్నారన్నారు.

సమస్యలపై మాట్లాడినందుకు ఈనెల 1న ఇద్దరు ఉద్యోగులను విధులకు రాకుండా నిలిపివేశారన్నారు. యాజమాన్యం చేపడుతున్న ఈ చర్యలపై ఆందోళన చెందిన ఉద్యోగులు అప్పటినుంచి విధులు బహిష్కరించారన్నారు. సంస్థ చైర్మన్ వెంటనే కలుగ జేసుకొని ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై యూనియన్‌తో చర్చించి పరిష్కరించాలని కోరారు.వెంటనే నూతన వేతన ఒప్పందం చేయాలని, కక్షసాదింపుల్లో బాగంగా బదిలీ చేసిన ఉద్యోగులకు మిమ్స్‌లోనే డ్యూటీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండేళ్ళ సర్వీసు పూర్తి చేసుకున్న వారందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. 2019లో వేతన ఒప్పందానికై ఉద్యోగులు పోరాడిన సందర్భంగా కొంతమంది ఉద్యోగులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకొని విధుల్లోకి తీసుకోవాలన్నారు. యాజమాన్యం చర్చలు జరిపి న్యాయం చేసే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. అనంతరం 19 న జిల్లా వ్యాప్తంగా మిమ్స్ ఉద్యోగులు పోరాటానికి మద్దతుగా రాస్తారోకోలు చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో ఇఫ్టూ నాయకులు అప్పలసూరి, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు వి.లక్ష్మి, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి. శ్రీనివాసరావు, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు వి.రాములు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్.ఆనంద్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్, డి వైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు హరీష్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.త్రినాథ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్, నాయకులు టివి రమణ, మిమ్స్ ఉద్యోగులు పైడిరాజు, సీతం నాయుడు,బంగారు నాయుడు, ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని

సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెసి కార్తీక్, డిఆర్‌ఒ అనిత

దామోదరం సంజీవయ్యకు నివాళి

ప్రజాశక్తి-విజయనగరం

మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యకు అధికారులు ఘనంగా నివాళులర్పించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం సంజీవయ్య జయంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంజీవయ్య చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్‌ఒ ఎస్‌డి అనిత పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంజీవయ్య దేశానికి, రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. ఆయన జీవిత చరిత్రను విద్యార్థులు చదివి వినిపించారు. కర్నూలు జిల్లాలో ఫిబ్రవరి 14, 1921లో జన్మించిన సంజీవయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా, తొలి దళిత ముఖ్యమంత్రిగా 39 సంవత్సరాల అతి చిన్న వయసులోనే సేవలందించారని పేర్కొన్నారు. ఆయన ఎఐసిసి అధ్యక్షులుగా రెండుసార్లు పనిచేయడమే కాకుండా, కేంద్ర మంత్రిగా, రాష్ట్ర మంత్రిగా కూడా విశిష్ట సేవలను అందించారని చెప్పారు. నిరుపేద దళిత కుటుంబంలో జన్మించిన దామోదరం సంజీవయ్య, నిరాడంబరతకు మారుపేరుగా నిజాయితీకి నిలువుటద్దంగా నిలిచి, అందరికీ ఆదర్శప్రాయుల య్యారని పేర్కొన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆశాఖ డిప్యుటీ డైరెక్టర్ రామానందం, డిఆర్‌డిఎ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి, మెప్మా పీడీ సుధాకరరావు, పశు సంవర్ధకశాఖ జెడి డాక్టర్ విశ్వేశ్వరరావు, ఎపిఎంఐపి పీడీ లక్ష్మీనారాయణ, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, సాంఘిక సంక్షేమశాఖతో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టిసి భద్రత.. అందరి బాధ్యత

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఆర్‌టిసి భద్రత అందరి బాధ్యతని ఆర్‌టిసి జోన్ 1 ఇడి సివి రవిశంకర్ అన్నారు. బుధవారం ఆర్టీసీ విజయనగరం డిపోలో రోడ్డు భద్రత మాసోత్స వాలు ముగింపు సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రాణాలు పోగొట్టుకోకూడ దన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ జి.రవీంద్ర నాథ్, ట్రాఫిక్ డిఎస్‌పి డి.విశ్వనాథం మాట్లాడుతూ ఒక ప్రమాదం వెనుక అనేక కుటుంబాలు ఉంటాయన్నారు. రోడ్డు భద్రత లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. సమిష్టి కృషితో ఆర్‌టిసిని అభివృద్ధి చేయాలన్నారు. ముందుగా ఆర్టీసీ లో ఉత్తమ ప్రమాద రహిత డ్రైవర్ల సేవలను గుర్తించి వారికి ప్రశంస పత్రాలు, నగదు బహుమతులు అందజేసి సత్కరించారు. మాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖనం,వ్యాసం రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ సిటిఎం సి.అప్పలనాయుడు, విజయనగరం డిపి టిఒ సిహెచ్.అప్పలనారాయణ, డిప్యూటీ మెకానికల్ ఇంజనీర్ కె.శ్రీనివాసరావు, డిపో మేనేజర్ జె.శ్రీనివాసరావు, డిప్యూటీ డిఎం బి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఆర్‌టిసి ఇడి రవిశంకర్

ప్రమాదకరమైన చట్టం రద్దుకు సంతకాల సేకరణ

ప్రజాశకి-విజయనగరం టౌన్

డ్రైవర్లను జైల్లో పెట్టే క్రిమినల్ చట్టం బిఎస్ఎన్ 106(1,2) రద్దు చేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పెట్రోల్, డీజిల్ ధరలు, ఫీజులు, పెనాల్టీల భారాలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్‌షాకు ఈనెల 16న కలెక్టర్ ద్వారా వినతి పత్రం ఇచ్చేందుకు సంతకాల సేకరిస్తున్నట్లు ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జిల్లా కన్వీనర్ ఎ.జగన్మోహన్‌రావు, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.రాములు తెలిపారు. బుధవారం ఐనాక్స్ ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు ఆర్.శ్రీను ఆధ్వర్యంలో సంతకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనతరం మాట్లాడుతూ అన్ని రకాల ప్రభుత్వ/ ప్రైవేటు వాహన యజమానులు, చోదకులు సంతకం చేసి , 16న ఉదయం 9 గంటలకు కోట నుంచి ప్రారంభమయ్యే వాహన ర్యాలీలో యూనిఫామ్‌తో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆటో యూనియన్ నాయకులు శ్రీను, రామునాయుడు, రాజు, లక్ష్మణ దొర, మోహన్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సంతకాలు సేకరిస్తున్న సిఐటియు నాయకులు

ఓటర్ల సవరణ కోసం 5051 దరఖాస్తులు

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల ప్రకటన వెలువడే వరకూ ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు అవకాశం ఉందని సంయుక్త కలెక్టర్ కె.కార్తీక్ తెలిపారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో తన ఛాంబర్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, మార్పులు, చేర్పులు, తొలగింపుల పట్ల ఆయా పార్టీల అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. గత బుధవారం నుండి ఈ బుధవారం వరకు సవరణ కోసం జిల్లా వ్యాప్తంగా 5051 ధరఖాస్తులు వచ్చాయని, వాటిని త్వరగా పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. తమకు అందిన ఫిర్యాదులపైనా చర్యలు తీసుకొని, వాటి వివరాలను తెలియజేస్తామని అన్నారు. ఇవిఎంలపై అవగాహన కలగడానికి, అపోహలు తొలగించడానికి అన్ని పార్టీల ప్రతినిధులకు ఇవిఎం బ్రోచర్లను అందజేశారు. సమావేశంలో డిఆర్‌ఒ అనిత, గజపతినగరం నియోజకవర్గాల ఇఆర్‌ఒ ప్రమీల గాంధీ, ఎన్నికల సూపరింటెండెంట్ ప్రభాకర్, వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి, దయానంద్, రమేష్, డిటిలు, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయిస్తున్న తల్లిదండ్రులు

సామూహిక అక్షరాభ్యాసాలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

వసంత పంచమి సందర్భంగా బుధవారం నగరంలోని ఎస్‌విఎన్ నగర్‌లోగల సరస్వతిదేవి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. వేలాది మంది తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకొచ్చి అక్షరాభ్యాసాలు చేయించారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలు, ఒడిశా నుంచి వేలాది మంది రావడంతో ఈ ప్రాంతం జనసంద్రంగా మారింది.

పరిహారానికి పడిగాపులు

- ట్రిబ్యునల్ కోర్టు చుట్టూ తిరుగుతున్న రైతులు
- గత ఆర్‌డిఒ నిర్వాకంతో తప్పని తంటాలు
- ప్రస్తుతం భూమి మీద ఉన్న రైతులను వదిలేసి పాత ఎఫ్‌సిఐ రికార్డు ప్రకారం జాబితా
- పొంతన కుదరక సిఎఫ్‌ఎంఎస్‌లో పరిహారాన్ని తిరస్కరించిన అధికారులు
- కోర్టులో రూ.22 కోట్లు జమ చేసేసిన ఆర్‌డిఒ

రైతులిచ్చిన భూముల్లో నుంచి వేస్తున్న అప్రోచ్ రోడ్డు ఇదే..

ప్రజాశక్తి - భోగాపురం

విమానాశ్రయానికి సంబంధించిన అప్రోచ్ రోడ్డు కోసం భూసేకరణ చేసేటప్పుడు ఆ భూములను సాగు చేసుకుంటున్న రైతులను గుర్తించి పరిహారం అందజేయాలి. కాని గతంలో పనిచేసిన ఆర్‌డిఒ భవాని శంకర్ మాత్రం ఎఫ్‌సిఐ రికార్డుల్లో ఉన్న ప్రాప్తికి ఎప్పుడో భూములు అమ్మేసినవారు, చనిపోయిన వారి పేర్లతో జాబితాను సిద్ధం చేశారు. పరిహారం కోసం సిఎఫ్‌ఎంఎస్ అప్‌లోడ్ చేశారు. తీరా భూమిమీద ఉన్న రైతుల బ్యాంకు ఎకౌంటు నెంబర్లకు, ఆర్‌డిఒ ఇచ్చిన జాబితాకు పొంతన కుదరలేదు. దీంతో పరిహారం వేయడానికి అధికారులు తిరస్కరించారు. చేసేదిలేక రైతులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు చెప్పకుండా విశాఖలోని ట్రిబ్యునల్ కోర్టులో రూ.22కోట్లు పరిహారం జమచేసి ఆర్‌డిఒ చేతులు దులుపుకున్నారు. ఇప్పుడు భూమిమీద ఉన్న రైతులు పరిహారం కోసం ఆ కోర్టు చుట్టు తిరగాలనిన పరిస్థితి ఏర్పడింది. కాని అధికారులు మాత్రం ఆ భూములను బలవంతంగా తీసుకొని విమానాశ్రయ నిర్మాణ సంస్థ అప్పజెప్పడంతో ఆ భూముల్లో నుంచి విమానాశ్రయానికి వెళ్లేందుకు తాత్కాలిక రహదారిని వేసుకుంటున్నారు. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి రైతుల్లో నెలకొంది. రైతులకు పరిహారం అందకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత ఆర్‌డిఒ పై మాత్రం ఉన్నతాధికారులు కనీసం చర్యలు తీసుకోకపోవడం విశేషం.

జాతీయ రహదారి నుంచి విమానాశ్రయానికి వెళ్లేందుకు వేసే అప్రోచ్ రోడ్డుకు అవసరమైన 110 ఎకరాలను గతంలో పనిచేసిన ఆర్‌డిఒ భవాని శంకర్ హయాంలో భూసేకరణ చేశారు. భూసేకరణ సమయంలో సంబంధిత భూములపై ఉన్న రైతుల వివరాలను సేకరించాలి. ఆ రైతుల పేరుమీద పరిహారం వేసేందుకు అవార్డు పాస్ చెయ్యాలి. కాని ఆర్‌డిఒ మాత్రం భూమి మీద ప్రస్తుతం ఉన్న రైతులను కాకుండా, క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయకుండా ఎఫ్‌సిఒ రికార్డులో సంబంధిత సర్వే నెంబర్లలో ఉన్న రైతులు పేరుమీద పరిహారం కోసం గతంలో అవార్డు పాస్ చేశారు. ఎఫ్‌సిఒ రికార్డులో ఎప్పుడో భూములు అమ్మేసిన వారు, చనిపోయిన వారు మాత్రమే ఉంటారు. వారి పేరు మీద సిఎఫ్‌ఎంఎస్ జమచేయడంతో పరిహారం ఇచ్చేందుకు అవ్వలేదు. ఎందుకంటే భూమిమీద ఉన్న రైతుల బ్యాంకు ఎకౌంటు నెంబర్లకు, ఆర్‌డిఒ ఇచ్చిన జాబితాకు పొంతన కుదరలేదు. దీంతో పరిహారం వేయడం కుదరలేదు. మళ్లీ ఆ సొమ్మును వెనక్కి తీసుకొని సరిచేసి వేసేందుకు అవకాశం లేదు. చేసిన తప్పును కప్పిపుచ్చుకోడానికి ఆర్‌డిఒ వెంటనే విశాఖలోని భూసేకరణ ట్రిబ్యునల్ కోర్టులో ఆ సొమ్మును వేసేశారు. దీంతో భూమిపై ఉన్న ప్రస్తుత రైతులంతా ఏడాది నుంచి ఆ పరిహారం కోసం కోర్టు చుట్టు తిరుగుతున్నారు.

తప్పు చేసిన ఆర్‌డిఒ భవాని శంకర్‌పై చర్యలేవి

ప్రస్తుతం భూమి మీద ఉన్న రైతుల పేర్లను సేకరించి వారిపేరు మీద పరిహారం కోసం అవార్డు పాస్ చెయ్యాలి. కాని కావాలనే ఎప్పుడో భూములను అమ్మేసిన రైతులతో పాటు చనిపోయిన రైతుల పేరు మీద పరిహారం చేసినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఇంత పెద్ద తప్పిదం చేసిన ఈయనపై గతంలోని ఉన్నతాధికారులు కనీసం చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. రైతుల పక్షాన ఉండాల్సిన ప్రజాప్రతినిధులు కూడా ఈయన చేసిన తప్పిదంపై కనీసం ఎక్కడా ఫిర్యాదు చేయకపోవడం విశేషం. చేసిన తప్పు కనబడుతున్నాసరే ఆయనపై చర్యలకు ఎందుకు వెనుకాడుతున్నారో తెలియడం లేదు. ప్రస్తుత ఆర్‌డిఒ సూర్యకళ మాత్రం రైతులకు పరిహారం అందజేసేందుకు తనవంతు కృషి చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. రైతులకు పరిహారం అందించేందుకు ఆమె ప్రత్యేక చొరవ చూపుతున్నారు. కాని ఆ పరిహారం అందాలంటే చనిపోయిన రైతులను, అమ్మేసినవారిని కోర్టుకు తీసుకువచ్చి ఆ భూమితో మాకు సంబంధం లేదని చెప్పాలి. అది సాధ్యం కాని పని. పోనీ వారి వారసులునైనా తీసుకురావాలి. ఇదంతా ఎప్పుడు జరుగుతుంది. రైతులకు పరిహారం ఎప్పటికి అందుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

కెవిడి ఎంప్లాయిస్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కొండవెలగాడకు చెందిన కెవిడి ఎంప్లాయిస్, శ్రీవిజయ దుర్గా యూత్ బుధవారం అదే గ్రామానికి చెందిన గిరిజాల సత్యవతికి రూ.50వేలు, బూటి రాముకు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. గిరిజాల సత్యవతి కొంతకాలంగా గుండె వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కెవిడి ఎంప్లాయిస్, విజయ దుర్గా యూత్ ఆమెకు ఆర్థిక సాయం చేశారు. అలాగే బూటి రాము కొంతకాలంగా అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బంది పడుతున్నట్టు గుర్తించి ఆయనకు కూడా సాయం అందించారు. వైజాగ్‌లో బాధితులు సత్యవతి ఇంటికి వెళ్లి నగదు అందించారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు చేస్తున్న కెవిడి ఎంప్లాయిస్, యూత్‌ను, పెద్దలు, గ్రామస్తులు అభినందిస్తున్నారు.

మొక్కలు నాటడం అవసరం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పర్యావరణాన్ని కాపాడేందుకు మొక్కలు నాటడం అవసరమని ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా మేనేజ్మెంట్ కమిటీ మెంబర్ దొడ్డి సూర్యారావు అన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ఉన్న ట్రైబల్ వెల్ఫేర్ స్కూలు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తరఫున బుధవారం మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కార్యక్రమంలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రధానమైనదన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ పి వరలక్ష్మి, ఆశపు మల్లేశ్వర రావు, శ్రీనాథ్ వెంకన్న బాబు, కమిటీ మెంబర్ జోగారావు మాస్టర్‌తో పాటు ట్రైబల్ స్కూల్ అధ్యాపకులు, హై స్కూల్ అధ్యాపకులు, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ పి.కృష్ణమూర్తి, కాలేజీ అధ్యాపకులతో కలిసి పనస, నేరేడు, వేప, కాగు, నల్లమద్ది, మొక్కలను నాటారు.

శంఖారావం సభా స్థలి పరిశీలన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పోలీసులతో చర్చిస్తున్న సువ్వాడ రవిశేఖర్

ఈ 16న టిడిపి శంఖారావంలో భాగంగా లోకేష్ నిర్వహించనున్న సభ స్థలాన్ని టిడిపి నాయకులు బుధవారం పరిశీలించారు. రామ తీర్థంలోని ప్రైవేట్ స్థలంలో జరగనున్న ఈ సభకు సంబంధించిన ఏర్పాట్లును టిడిపి రాష్ట్ర పరిశీలకులు (ఇచ్ఛాపురం), జిల్లా సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక ఎస్ఐ డి.రామ గణేష్‌తో మాట్లాడి సభ విజయ వంతానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు రెల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని రెడ్డికంచేరు పంచాయతీలో వివిధ అభివృద్ధి పనులకు వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. పంచాయతీలో నూతనంగా వేస్తున్న సిమెంట్ రోడ్లు, కాలువలకు శంకుస్థాపన చేయగా గాబువానిపాలెంలోని శ్మశాన వాటికలో బోరును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బైరెడ్డి రమణ, సచివాలయ కన్వీనర్ శీరపు గురునాథ్ రెడ్డి, నాయకులు దల్లి బంగారు రెడ్డి, వంశి రెడ్డి, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

నగర పంచాయతీలో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి- నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధి గాంధీనగర్ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష ఆరోగ్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. వైద్యులు దక్షయరాం నాయుడు, ఎల్. వినోద్, ఎన్. మౌనిక వందన, టి.రమణమ్మ 160మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజినీ, వైస్ చైర్మెన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, వైసిపి పట్టణ అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, బోర్డు డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

శ్రీ ఆదిత్య విద్యాలయం ఆవరణలో బుదవారం శ్రీ విగ్నేశ్వర సహిత లక్ష్మీ సరస్వతి మందిరంలో లలితాదేవి, చండీ ఉపాసకులు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో సామూహిక ఉచిత అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 400 మందికి అన్నదాన చేశారు. అనంతరం ఆదిత్యా విద్యాలయం మేనేజ్మెంట్ మాట్లాడుతూ 2008లో స్థాపించిన ఈ మందిరం ద్వారా ప్రతి సంవత్సరం ఉచిత సామూహిక అక్షరాభ్యాసాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మాస్టర్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా స్థాయి మాస్టర్స్ షటిల్ బ్యాడ్మింటన్ సెలెక్షన్ కమ్ టోర్నమెంట్ లో సింగిల్స్ విభాగంలో ప్రథమ స్థానం, డబుల్స్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర పోటీలకు విద్యుత్‌శాఖ రికార్డ్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న పి.పైడిరాజు ఎంపికయ్యారు. ఈ నెల 16 నుండి 18 వరకు రాజ మహేంద్రవరంలో 35 నుండి 70ఏళ్ల వరకూ అన్ని కేటగిరీ లో జరుగునున్న పోటీల్లో పాల్గొననున్నారు. ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని విద్యుత్ శాఖ ఎస్ఇ ముప్వల లక్ష్మణ్‌రావు, ఇఇ పి.హరి, స్పోర్ట్స్ కార్యదర్శి వి.మోహన్‌బాబు అభినందించారు.

పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బానాది ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం ఎంఇఒ పి. బాలభాస్కరరావు పరిశీలించారు. ముందుగా పాఠశాల ఆవరణ పరిశీలించి, విద్యార్థుల నోట్‌బుక్స్, లెసన్ డైరీలు, మరుగుదొడ్లు, విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో సిఆర్‌పిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన అయ్యలు

ప్రజాశక్తి -విజయనగరం టౌన్

టిడిపి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న శంఖారావం కార్యక్రమానికి విచ్చేసిన ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను బుధవారం జనసేన నాయకులు గురాన అయ్యలు పార్వతీపురంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.


లోకేష్‌ను సత్కరిస్తున్న గురాన అయ్యలు

రైతు అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- గంట్యాడ

రైతు అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయంగా ఆర్‌బికెలను నిర్మించిందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని వసంత గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల కాలంలో రైతులకు అనేక పథకాలను అందజేశామన్నారు. విత్తనాలను ఇతర పనిముట్లను రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ప్రభుత్వం అందిస్తుందన్నారు. కొనుగోలు కేంద్రాలను రైతు భరోసా కేంద్రాల వద్ద ఏర్పాటు చేసి ప్రతి గింజను ప్రభుత్వం కొంటుందన్నారు. నియోజకవర్గ పరిధిలో 85శాతం కేంద్రాలు నిర్మించామని మిగిలినవి

ఆర్‌బికెను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొత్స

వివిధ దశలో ఉన్నాయని త్వరలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పీరుబండి హైమావతి, జెడ్‌పిటిసి వరి నరసింహమూర్తి, గ్రామ సర్పంచ్ సిరికి అచ్చియమ్మ, ఎఒ బి.శ్యామ్ కుమార్, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పి జైహింద్ కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలకు స్పందన

వేపాడ: మండలంలోని సింగరాయలో బుధవారం నిర్వహించిన 104 వెహికల్ సేవలకు విశేష స్పందన లభించింది. ఈ వైద్య సేవలకు వచ్చిన రోగులకు వేపాడ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిని ఎ. ధరణి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిరుజోగి వెంకటరావు, పిహెచ్‌సి సిబ్బంది తంగేటి సత్యనారాయణ, ఆశ వర్కర్ జుంజురు రామలక్ష్మి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తనిఖీ చేస్తున్న వైద్యులు ధరణి

మహిళలు ఉన్నత స్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మహిళా సాధికారత లక్ష్యంగా మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థాయిలో ఉండేందుకు బలోపేతం చెయ్యడం కోసం అక్క చెల్లమ్మలకు ఇచ్చిన మాట తప్పకుండా స్వయం సహాయక సంఘాలకి 4వ విడత రుణమాఫీలు చేసిన ఘనత జగనన్నకు తొక్కుతుం దని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని ఆకుల డిపో ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన వైయస్సార్ ఆసరా సంబరాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో మొత్తం 1312 స్వయం సహాయ సంఘాలలో గల 14,255 మంది మహిళలకు సుమారుగా రూ.7.82కోట్లు మంజూరు చేశామన్నారు. మళ్లీ జగనన్నని సీఎంగా గెలిపించుకోడానికి మనం అందరం సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ

చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వేచలపు చినరాము నాయుడు, స్టేట్ ఫోక్ అండ్ కల్చరల్ డైరెక్టర్ వాకాడ రాంబాబు, జామి, ఎస్‌కోట వైసిపి మండల అధ్యక్షులు గొర్లె రవి, మోపాడ కుమార్, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, ఎస్.కోట పట్టణ అధ్యక్షుడు రెహమాన్, పోతనాపల్లి సర్పంచ్ కూనిరెడ్డి వెంకటరావు, కొట్టం శానాపతి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లమ్మ ఆలయ ప్రతిష్ట

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని పోలిపల్లిలో పైడితల్లి అమ్మవారి ఆలయ పున్న ప్రతిష్ట కార్యక్రమం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పలనాయుడు ప్రారంభోత్సవం చేశారు. ప్రభుత్వం సిజిఎఫ్ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేయగా మిగతా సొమ్మును గ్రామస్తులు చందాలు వేసుకొని నిర్మించారు. ఈ సందర్భంగా ఆదివారం నుంచి మూడు రోజులగా ఈ ప్రతిష్టకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. గ్రామ పెద్దలు కర్రోతు బంగార్రాజు, వెంకటరమణ, పతివాడ రామకృష్ణ, కర్రోతు పైడిరాజు తదితరులు మాలలు ధరించి ఆలయంలో వేద పండితుల మధ్య పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని వచ్చిన భక్తులకు అన్న ప్రసాదాలను వడ్డించారు. గ్రామస్తులంతా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నదానానికి టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు రూ. 20వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో పతివాడ నారాయణస్వామి నాయుడు, తమ్ము నాయుడు, కర్రోతు సత్యన్నారాయణ, పిన్నింటి చిన్న, శంకర్, కర్రోతు బంగార్రాజు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

పుల్వామా సైనికులకు నివాళి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

దేశం కోసం అనుక్షణం తపనపడి ప్రాణాలర్పించిన సైనికులను మనం స్మరించుకోవాలని ఓక్లాండ్ పాఠశాల కరస్పాండెంట్ పాల్‌శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఓక్లాండ్ పాఠశాలలో బుధవారం పుల్వామా దాడిని జ్ఞాపకం చేసుకుంటూ వీర సైనికులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సైనికుడు భూషణంను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14న జమ్ము శ్రీనగర్‌లో సైనికులపై ఆత్మాహుతి దాడి జరిగిందన్నారు. ఈ దాడిలో మరణించిన వీర సైనికులకు జోహార్లు తెలుపుతున్నామన్నారు. సైనికులు త్యాగాలు మరవలేనివన్నారు. ప్రతి

మాజీ సైనికుడిని సత్కరిస్తున్న ప్రతినిధులు

ఒక్కరూ దేశ భద్రత కోసం పాటుపడాలన్నారు. పాఠశాల చైర్మన్ శివన్నారాయణ, ప్రిన్సిపాల్ చాపా రవి మాట్లాడుతూ సైనికులు త్యాగాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

పిల్లలకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాం అంగన్‌వాడీ కేంద్రం-2లో చదువుతున్న పిల్లలకు గ్రామానికి చెందిన కుర్రాయి కుమారి, సవర్తి దివ్య ఆర్థిక సాయంతో సమకూర్చిన పలకలు, పుస్తకాలను బుధవారం అందించారు. దాతలను అంగనవాడి కార్యకర్త ఉమామహేశ్వరి తదితరులు అభినందించారు.

వ్యాన్‌ను ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి షుగర్ కర్మాగారం సమీపంలో ఐచర్ వ్యాన్‌ను ద్విచక్ర వాహనంతో వస్తున్న ముగ్గురు విద్యార్థులు ఢీకొన్న సంఘటనలో మజ్జి రాముడు పేటకు చెందిన బలివాడ తరుణ్ (25) అక్కడకక్కడే మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన పొట్నూరు దిలీప్, బలివాడ హరిలకు తీవ్ర గాయాలు కావడంతో వీరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు.. పాలకొండ నుంచి తరుణ్, దిలీప్, హరి ద్విచక్ర వాహనంతో స్వగ్రామానికి పనులు ముగించుకుని తిరిగి వస్తున్నండగా సంకిలి షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న ఐచర్ వ్యాన్‌ను బ్యాక్ చేస్తుండగా ద్విచక్ర వాహనం వచ్చి వ్యాన్ వెనుక భాగం చక్రాల్లోకి దూసుకెళ్లింది. దీంతో ద్విచక్ర వాహనంపై ప్రయణిస్తున్న ముగ్గురికి బలమైన గాయాలయ్యాయి. వీరిలో తరుణ్ అక్కడికక్కడే మృతి చెందగా, దిలీప్, హరిలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. మీరు ముగ్గురు పాలకొండ, ఇతర పట్టణాల్లో ఉన్నత విద్య చదువుతున్నారు. స్థానికులు108కు సమాచారం అందించగా ఈఎంటి మీసాల ఈశ్వరరావు, ఫైలెట్ జగన్నాథరావు ప్రథమ చికిత్స చేశారు. రేగిడి

ఘటనా స్థలంలో క్షతగాత్రులు

ఇద్దరి పరిస్థితి విషమం

ఎస్ఐ ఈ శ్రీనివాసరావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఎస్ఐ దగ్గరుండి వ్యాన్ వెనుక భాగంలో ఇరుక్కున్న ముగ్గురిని స్థానికుల సహాయంతో బయటకు తీసి స్ట్రక్చర్ పై స్వయంగా సేవలందించారు. దిలీప్, హరిలను ముందుగా పాలకొండ ఏరియా ఆసుపత్రికి వైద్యం కోసం తరలించారు. అక్కడ వైద్యం చేసిన డాక్టర్లు పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం మెరుగైన వైద్యం కోసం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉన్నత చదువులు చదివి ఉద్యోగం చేస్తానని మృతుడు తరుణ్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు చెప్పి ఇలా అర్థాంతరంగా చనిపోవడంతో వారి రోదన పలువురిని కంటతడి పెట్టించింది. దిలీప్, హరిలు ఉన్నత చదువులు చదివి కుటుంబానికి చేదుడు వాదోడుగా ఉంటారనుకున్న సమయంలో ఇలా రోడ్డు ప్రమాదం జరగడంతో వారి కుటుంబ సభ్యుల రోదన మిన్నంటింది.

40 మద్యం సీసాలు పట్టివేత

లక్కవరపుకోట: మండలంలోని గోల్డ్ స్టార్ జంక్షన్ వద్ద అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న జమ్మాదేవిపేట గ్రామ నివాసి బోజంకి నాయుడును అరెస్టు చేసి ఆయన నుండి 40 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ ఆర్.గోపాలరావు బుధవారం తెలిపారు.

భోగాపురం: మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సిఐ రవికుమార్ తెలిపారు. రామచంద్రపేట గ్రామానికి చెందిన కోలా రమణ 10 మద్యం సీసాలు తరలిస్తు ఒడగా రామచంద్ర పేట వద్ద బుధవారం పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హుండీలో నగదు చోరీ

ప్రజాశక్తి- లక్కవరపుకోట

మండల కేంద్రంలో గల సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం సమీపంలో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయ హుండీలో మంగళవారం అర్ధరాత్రి నగదు చోరీకి గురైనట్లు నిర్వాహకులు గుర్తించారు. దుండగులు విద్యుత్ వైర్లను తొలగించి గుణపం సహాయంతో హుండీని పగలగొట్టి ఉంటారని నిర్వాహకులు టి శ్రీనివాస్, తరిణి వెంకటరమణ తెలిపారు. సుమారు రూ.10 వేలు వరకు చోరీకి గురై ఉంటుందని అంచనా వేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- విజయనగరం కోట

స్థానిక రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న రిజర్వేషన్ కౌంటర్ వద్ద చనిపోయి ఉన్న వ్యక్తిని గుర్తించామని ఒకటో పట్టణ సిఐ బి. వెంకటరావు తెలిపారు. అతని వయసు సుమారు 50 సంవత్సరాలుంటాయని అతని వద్ద ఎటువంటి అడ్రాసు ఆధారం లేకపోవడంతో మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి మార్చురీలో ఉంచామని చెప్పారు.

CHANGE OF NAME

Mrs. Regamma Paila New Name as per Pan Card and Addhar Card W/o Sanyasi SC Street, Vantharam (Post), Balijipeta (SO) Therlam (MD), Vizianagaram Pin : 535557

Old Name :- Regamma Kalipelli to

New Name :- **Regamma Paila**

D.O.B :- 12-11-1960

Hence forth I am Being called New Name Regamma Paila W/o Sayasi for all purposes.

పిఎసిఎస్ గోదాములు ప్రారంభం

ప్రజాశక్తి - రామభద్రపురం

మండల కేంద్రంలో గల పిఎసిఎస్‌కు చెందిన గోదాములను బుధవారం స్థానిక ఎమ్మెల్యే ఎస్‌వి చినప్పలనాయుడు ప్రారంభించారు. సుమారు రూ.36 లక్షలతో నూతనంగా నిర్మించిన 5 గోదాములను, నూతనంగా ఏర్పాటు చేసిన జనరిక్ మెడికల్ షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పిఎసిఎస్‌ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రతి మండల కేంద్రంలోనూ సెంట్రల్ బ్యాంకు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు ఈ బ్యాంకుల ద్వారా అధిక సదుపాయాలు, వ్యవసాయ, అనుబంధ రుణాల మంజూరుకు కృషి చేయాలని ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, పిఎసిఎస్ అధ్యక్షులు కిర్ల చంద్రశేఖర్, డిసిసిబి సీఈఓ జనార్ధనరావు, విశాఖ డెయిరీ అధ్యక్షులు చొక్కాపు రామకృష్ణ, జెసిఎస్ కన్వీనర్ చింతల సింహాచలం నాయుడు, స్థానిక వైసిపి నాయకులు, సిబ్బంది అప్పారావు, పరమేశు, వాసు పాల్గొన్నారు.

గోదామును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

మహారాజశ్రీ విజయనగరం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో

SOP No.1/2024

Between:

Thoota Rambai W/o Satyam, Boppadam (V), Nellimarla (MD), Vizianagaram (Dist)

And:

1. Beeraka Gangavathi W/o late Pantayya, Door No.9-16-1/1, Balijiveedhi, Vizianagaram
2. Mettu Satyavathi D/o Late Pentayya - do-
3. Reddi Varalakshmi D/o late Pentayya -do-
4. Thota Madhavi D/o Late Pentayya - do-
5. Beeraka Vijaya W/o Late Sanyasirao
6. Beeraka Kalyan S/o Late Sanyasirao -do-
7. Balla Usharani D/o Late Sanyasirao -do-
8. Anupuja Aswani D/o Late Sanyasirao -do-

NOTICE

ఇందలి పిటిషనరు తోట రాంబాయి తన తల్లి బీరక లేటు సూరమ్మ వారసులుగా ఆమె తాలుకా ఎరియర్స్ పెన్షన్ వగైరాలు పొందుటకు Succission Certificate జారీచేయమని కోరుచూ పై నెంబరు కేసును దాఖలు చేశారు. ఇందలి కేసులో ఎవరికైనా ఎట్టి ఆక్షేపణలున్న ఎడల **తే 4-3-2024దీన ఉదయం 10-30 గం॥లకు** పై కోర్టువారి ఎదుట హాజరై మీ యొక్క ఆక్షేపణలను తెలియజేయవలెను. అట్లు కానిచో మీ పరోక్షంగా ఉన్న ఆధారాల మేరకు కోర్టువారు తీర్పు వెల్లడిచేయడం జరుగుతుందని తెలియజేయడమైనది.

గూనాన రాంబాబు
పిటిషనరు తరుపు న్యాయవాది
విజయనగరం, సెల్: 9603384151

FACOR ALLOYS LIMITED

Regd. Office : Shreeramnagar - 535 101, Garividi, Dist. Vizianagaram (A.P.) CIN: L27101AP2004PLC043252

WEBSITE : www.facoralloys.in PHONE : +91 8952 282029 FAX : +91 8952 282188 E-MAIL : facoralloys@falgroup.in

STATEMENT OF UNAUDITED STANDALONE AND CONSOLIDATED FINANCIAL RESULTS FOR THE QUARTER AND NINE MONTHS ENDED 31ST DECEMBER, 2023

(₹ in Lakhs)

SR. NO.	PARTICULARS	STANDALONE						CONSOLIDATED					
		Quarter Ended			Nine Months Ended		Year Ended	Quarter Ended			Nine Months Ended		Year Ended
		31st December 2023	30th September 2023	31st December 2022	31st December 2023	31st December 2022	31st March 2023	31st December 2023	30th September 2023	31st December 2022	31st December 2023	31st December 2022	31st March 2023
		Unaudited	Unaudited	Unaudited	Unaudited	Unaudited	Audited	Unaudited	Unaudited	Unaudited	Unaudited	Unaudited	Audited
1	Total Income from operations	709.98	4,810.89	8,308.47	15,337.37	21,418.09	32,098.81	709.98	4,810.89	8,308.47	15,337.37	21,418.09	32,098.81
2	Net Profit / (Loss) for the period (before Tax, Exceptional and / or Extraordinary items)	(503.75)	(870.56)	(354.67)	(1,810.26)	(400.38)	262.57	(543.05)	(861.94)	(359.23)	(1,739.66)	(415.90)	290.29
3	Net Profit / (Loss) for the period (before Tax, after Exceptional and / or Extraordinary items)	(764.86)	(877.30)	(364.74)	(2,837.13)	1,329.28	1,595.28	(803.65)	(195.40)	(369.30)	(2,092.74)	1,313.76	3.27
4	Net Profit / (Loss) for the period after Tax (after Exceptional and / or Extraordinary items)	(616.75)	(666.31)	(301.20)	(2,178.36)	2,128.93	2,288.12	(655.54)	15.59	(305.76)	(1,433.97)	2,113.41	696.11
5	Total Comprehensive Income for the period [comprising Profit/ (Loss) for the period (after tax) and Other Comprehensive Income (after tax)]	(613.06)	(662.63)	(302.46)	(2,167.31)	2,125.16	2,378.51	(651.85)	(776.39)	(307.03)	(2,218.58)	2,189.16	1,636.81
6	Equity Share Capital	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48
7	Other Equity (excluding Revaluation Reserve) #	—	—	—	—	—	—	—	—	—	—	—	—
8	Earnings per share (before extraordinary items) (of ₹ 1/- each) (not annualised) :												
	(a) Basic	(0.32)	(0.34)	(0.15)	(1.11)	1.09	1.17	(0.33)	(0.02)	(0.16)	(0.77)	1.08	0.43
	(b) Diluted	(0.32)	(0.34)	(0.15)	(1.11)	1.09	1.17	(0.33)	(0.02)	(0.16)	(0.77)	1.08	0.43

Other Equity (excluding Revaluation Reserve) for the year ended 31st March, 2023 is ₹ 16,893.07 lakhs for standalone and ₹ 16,940.01 lakhs for consolidated result.

Notes:

1 The above is an extract of the detailed format of Quarterly and Nine Months Ended Financial Results filed with the Stock Exchange under Regulation 33 of the SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulation, 2015. The full format of the Quarterly and Nine Months Ended Financial Results are available on the website of Stock Exchange at **www.bseindia.com** and on the Company's website **www.facoralloys.in.**

2 Previous period figures are regrouped/rearranged wherever necessary to facilitate comparison.

Place : New Delhi
Date : 14th February, 2024

For FACOR ALLOYS LIMITED,
R. K. SARAF
CHAIRMAN & MANAGING DIRECTOR
(DIN : 00006102)

AAA